క్లుప్తంగా

విజయలక్ష్మికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీక్షేత్రమ్‌లో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో విజయలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వితరణ



స్ట్రెచర్స్ అందుకుంటున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి పట్టణానికి చెందిన దుర్గా వేణుగోపాల్, విజయలక్ష్మి దంపతులు రూ.50 వేల విలువ చేసే స్ట్రెచర్స్‌ను శుక్రవారం వితరణగా అందజేసారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడు, ఆర్ఎంఓ ఎస్.సురేష్ బాబు, ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలాజీ ప్రాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



జానా ప్రసాద్

నెల్లిమర్ల: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు నెల్లిమర్ల పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జానా ప్రసాద్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మారిన దృష్ట్యా పదవికి రాజీనామా చేశానన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు రాజీనామా లేఖను పంపించినట్లు చెప్పారు. పదవీ కాలంలో తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన ఎన్నికల కోడ్..

- తొలగిన ముసుగులు

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కోడ్ ముగిసింది. మార్చి 16న అమల్లోకి వచ్చిన కోడ్ గురువారం ఎత్తివేశారు. కోడ్ సమయంలో జిల్లా యంత్రాంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసింది. అలాగే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ బృందాలను నియమించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ ముగియడంతో శుక్రవారం ముసుగులు తొలగించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చర్యలు



డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ ఎస్సై రాజు

విజయనగరం క్రైమ్: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై రాజు హెచ్చరించారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శుక్రవారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి అశోక్ భార్యకు అస్వస్థత

విజయనగరం రూరల్: కేంద్ర మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పి.అశోక్‌గజపతిరాజు సతీమణి పి.సునీలా గజపతిరాజు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. శుక్రవారం సాయంత్రం అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు స్థానిక తిరుమల ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ఇక్కడ నుంచి విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రజా తీర్పును గౌరవిద్దాం..

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



హాజరైన కార్యకర్తలు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు
- ఎన్నికల్లో కార్యకర్తల సహకారం మరువలేనిది : మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- కార్యకర్తలకు అండగా ఉంటాం : మాజీ ఎంపీ బెల్లాన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, ఓటమికి నిరుత్సాహపడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలతో స్థానిక సుజాత కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడానికి కార్యకర్తలు చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఎన్నికల్లో ఓటమి కొంత నిరాశకు గురిచేసినా.. గెలుపోటములు సహజమన్నారు. విజయనగరం నియోజకవర్గ అభివృద్ధికి కోలగట్ల వీరభద్రస్వామి అకుంఠిత దీక్షతో పని చేశారని కొనియాడారు. 365 రోజులు ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచారన్నారు. కూటమి నేతల హామీలకు ప్రజలు ఆకర్షితులై ఓట్లు వేశారని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు ఓటమికి కుంగిపోకుండా మరింత ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా, ఏ అవసరమొచ్చినా పార్టీ, నాయకులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఫలితాల అనంతరం జరుగుతున్న పరిణామాలు ఆందోళనకరంగా ఉన్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. గెలుపు ఉత్సాహంలో కూటమి నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చులయాయాదవ్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్పొరేటర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణం తీర్చుకుంటాను..



సుదీర్ఘ రాజకీయ జీవితంలో తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తల రుణం తీర్చుకుంటాను. దేశ చరిత్రలో అవినీతికి తావులేని విధంగా పాలన సాగించాం. ఓటమితో కృంగిపోకుండా మరింత ఉత్సాహంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం. కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ప్రజలకు అండగా నిలవాలి.

– కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ డిప్యూటీ స్పీకర్

కార్యకర్తలకు అండగా ఉంటాం..



పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనం తెలియజేస్తున్నా. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పోరాడాలి. సమర్థవంతమైన నాయకత్వంతో ముందుకు సాగి మరలా విజయం సాధిద్దాం. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం.

– బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పూసపాటిరేగ : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి శీరపు ఇందుమతి అన్నారు. మండలంలోని కుమిలి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన ముగింపు శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో కుమిలి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు రాంబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీవీ రాజేష్ తెలిపారు. డాబాగార్డెన్స్ ప్రాంతంలో గల సీతారామస్వామి కోవెల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ, 60 రోజులుగా బాటసారులకు మజ్జిగ అందజేస్తున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అరుణ్‌కుమార్ సుదాని, ప్రాజెక్ట్ చైర్మన్లు కొల్లా సాయిమనోజ్, కృష్ణగోపాల్ అగర్వాల్, బలభద్రుని అశోక్, మంచుకొండ అశోక్, పెంటపాటి కామరాజు, పీఎల్ఎన్ మూర్తి, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: విమానాశ్రయం నిర్మాణ ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మండలంలోని ఎ. రావివలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, ఆర్ అండ్‌ఆర్ కాలనీ, చాకివలస, జీఎంఆర్ విమానాశ్రయ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్‌వలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డెంకాడలో..

డెంకాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, గుణుపూరుపేట, పెదతాడివాడ, బేతనాపల్లి, ఊడుకుటపేట, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస గ్రామాల సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- అనధికార భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదని సభ్యుల ధ్వజం
- పన్ను వసూళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు




సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వాడీవేడిగా సాగింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికార, విపక్ష సభ్యులు పలు అంశాలపై ధ్వజమెత్తారు. మొయిద జంక్షన్‌లోని సత్య సినిమా థియేటర్ వద్ద నిర్మిస్తున్న ఏడు అంతస్తుల భవనానికి అనుమతులు ఉన్నాయా అని కౌన్సిలర్లు లెంక హైమావతి, మొయిద శ్రీనివాసరావు ప్రశ్నించారు. అనుమతుల్లేవని అధికారులు చెప్పడంతో.. అలాంటప్పుడు నిర్మాణం ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. అలాగే పట్టణ పరిధిలోని ఒక సంస్థకు సంబంధించి ఎంత మొత్తంలో పన్ను వేశారు? ఏయే భవనాలకు వేశారు? తదితర వివరాలు ఇవ్వాలని సభ్యులు కోరారు. పన్నులు వేసే విషయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కౌన్సిల్ తీర్మానాల్లో నిచ్చెన కొనుగోలుకు రూ. 25 వేలు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా.. అంత మొత్తం ఎందుకని పలువురు వ్యతిరేకించారు. రెల్లివీధిలో ప్రమాదకరంగా ఉన్న శిథిలమైన నుయ్యిని పూడ్చడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో కమిషనర్ పి. బాలాజీప్రసాద్, మేనేజర్ విశ్వేశ్వరరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, మైపాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ ప్రమాదకరం

- నేడు ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినం
- ప్రతి ఏటా పెరుగుతున్న కేసులు



మెదడులో ఏర్పడ్డ ట్యూమర్ (రెడ్‌మార్కులో)

విజయనగరం ఫోర్ట్: బ్రెయిన్ ట్యూమర్ (మెదడులో కణతులు ఏర్పడడం) అనేది చాలా ప్రమాదకరమైనది. ఈ వ్యాధి బారిన పడితే కోలుకోవడం కష్టతరం. ఈ నేపథ్యంలో బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవశ్యకత ఉంది. శనివారం ప్రపంచ ట్యూమర్ దినం సందర్భంగా సాక్షి అందిస్తున్న కథనం. మెదడులో గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ ట్యూమర్స్ అంటారు. వీటిలో కొన్ని క్యాన్సర్‌తో సంబంధం ఉన్నవి. మరి కొన్ని సంబంధం లేనివి ఉంటాయి. దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యే వ్యక్తులు, పొగతాగే వ్యక్తులకు బ్రెయిన్ ట్యూమర్ వచ్చే అవకాశం ఉంది. బ్రెయిన్ ట్యూమర్‌కు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఏమాత్రం అనుమానవం వచ్చినా వైద్యులను సంప్రదించాలని లేకపోతే ప్రాణాల మీదకు తెచ్చుకున్న వారవుతారని తెలిపారు.

వ్యాధి లక్షణాలు ..

తలనొప్పి, ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి, పడుకున్నప్పుడు తలనొప్పి ఎక్కువ కావడం, వికారం, వాంతులు ఏవైనా రెండుగా కనిపించడం. కొన్ని సార్లు మూర్ఛ రావడం, కంటి సమస్యలు, మాటలు సరిగా మాట్లాడలేకపోవడం, సరిగ్గా నడవలేకపోవడం, ముఖం ఓ వైపు తిరిగిపోవడం, ప్రవర్తనలో మార్పు, మతిమరుపు లాంటివి కనిపిస్తాయి. మెదడులో కణతి పరిమాణాన్ని బట్టి స్థలాన్ని అక్రమిస్తుంది. కణతి పెరిగిన కొద్దీ మెదడు కణజాలంపై ఒత్తిడి పెరుగుతుంది.

సకాలంలో వైద్యం



బ్రెయిన్ ట్యూమర్‌కు సకాలంలో వైద్యం చేయించుకోవాలి. లేదంటే ప్రాణాలకు మీదకు వస్తుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. ఎంఆర్ఐ స్కాన్ ద్వారా దీన్ని గుర్తించగలం.

డాక్టర్ మురళీ కృష్ణ, న్యూరోసర్జన్, తిరుమల మెడికవర్ ఆస్పత్రి

హజరత్ సయ్యద్ బాబా ఉరుసు మహోత్సవం నేడు

విజయనగరం టౌన్: పట్టణంలోని కుముందన్ వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ గుల్లేమిర్జ్ షాం బాబా 37వ ఉరుసు మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే దాదా, షేక్ జానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థినికి సత్కారం

నెల్లిమర్ల: పదో తరగతి రీ వాల్యూయేషన్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన మద్దిల లలితను పలువురు శుక్రవారం అభినందించి, సత్కరించారు. లలితకు గతంలో 548 మార్కులు సాధించగా.. రీ వాల్యూయేషన్‌లో 556 మార్కులు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరించిన దరఖాస్తులను ఈ నెల 12వ తేదీ లోపు మోడల్ స్కూల్‌లో అందించాలన్నారు. విద్యార్థి స్టడీ సర్టిఫికెట్‌తో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అందజేయాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

అభినందనలు



ఎమ్మెల్యేగా ఎన్నికైన అదితి గజపతిరాజుకు మొక్క ఇచ్చి అభినందనలు తెలియజేస్తున్న కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం శాసన సభ్యురాలిగా ఎన్నికైన పూసపాటి అదితి గజపతిరాజును మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక అశోక్ బంగ్లాలో నూతన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు వివిధ విభాగాల అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదితి గజపతిరాజును కలిసిన వారిలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, మేనేజర్ ప్రసాదరావు, ఆడిట్ అధికారి లూథర్‌పాల్, టీపీఆర్ఓ సింహాచలం, గణాంక అధికారి రోజావెంకటలక్ష్మి, డీఈలు, ఏఈలు, ప్రజారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏతో దేశాభివృద్ధి

- శివప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: ఎన్‌డీఏ కూటమితో దేశాభివృద్ధి సాధ్యపడుతుందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోను, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ కూటమికి మద్దతునిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. వరుసగా మూడోసారి దేశానికి ప్రధానిగా నరేంద్ర మోదీ పగ్గాలు చేపట్టడం శుభపరిణామన్నారు. అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ సమష్టిగా ఎంతో విజ్ఞతతో ఎన్‌డీఏ కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు అందించాలనే సంకల్పంతో వికసిత్ భారత్ ఏర్పాటైందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్పారావు, జగ్గారావు, మజ్జి రమేష్, అబ్దుల్ అధిల్, గిరిబాబు, కంది సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లు సద్వినియోగం

డెంకాడ: గ్రంథాలయాల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని రిటైర్డ్ లైబ్రేరియన్ డి.దేవుడు, లైబ్రేరియన్ వై.మహేష్ అన్నారు. మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్యాంప్‌లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలు చదివారన్నారు. ఇండోర్ గేమ్స్ కూడా ఉత్సాహంగా ఆడారని చెప్పారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ప్రజాతీర్పును గౌరవిస్తామని, నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తామని, ఎవరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఎస్.కోట ఎమ్మెల్యేగా ఎన్నికైన కోళ్ల లలితకుమారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను గుర్తించి అందుకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు సూచనలతో అంతా కలిసి భవిష్యత్ కోసం పనిచేయాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ ఓటమిపై కారణాలను విశ్లేషించారు. టీడీపీ మేనిఫెస్టో ప్రజల్ని ఆకర్షించి ఉండొచ్చని, వైఎస్సార్‌సీపీ కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు టీడీపీ అమలు చేస్తుందని ప్రజలు ఆశపడి ఉండవచ్చన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటామని, ప్రజల తరపున ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు నిలుపుకుని, ప్రజల బాగు కోసం పనిచేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ డోల కనకమహాలక్ష్మి, క్రిష్టాపురం సర్పంచ్ యామినీదేవి, పార్టీ నాయకులు వాకాడ రాంబాబు, సాంబరాజు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం

- ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు అధిక సంఖ్యలో హాజరయ్యేటట్టు చూడాలని సూచించారు. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. అలాగే లబ్ధిదారులకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ డోకుల ఉమాభారతి, సిబ్బంది పాల్గొన్నారు.